# పదిరూపాయలు

లక్ష్మీపతికి ప్రస్తుతం పది రూపాయలు కావాలి! అతి అర్జెంటుగా కావాలి పది రూపాయలు! అతని భార్యకు నిన్నరాత్రి గుండెల్లో విపరీతమయిన నొప్పి వచ్చింది! సాధారణంగా ఆవిడకు నెలాఖరు రోజులలోనే రోగాలు వస్తుంటాయి!!!

ఉదయం ఆఫీసుకు వచ్చేముందు డాక్టర్ని పిలిచి, తర్వాత ఫీజు యిచ్చుకుంటానని బ్రతిమాలి యింటికి తీసికెళ్లి భార్యను చూపించాడు. డాక్టరు పది నిమిషాలు పరీక్షించి పదిరూపాయలకు సరిపడిన మందుల చీటీ వ్రాసి యిచ్చి వెంటనే వాడమన్నాడు. మరోసారి నొప్పివస్తే బ్రతకటం కష్టమని కూడా చెప్పాడు.

పతి వద్ద పది రూపాయలులేవు! మందులు కొనటానికి అతనికి పది రూపాయలు కావాలి! 'మధ్యాహ్నం'

లంచ్ టైములో తోటి గుమస్తా రఘురామ్‌వద్ద తన గోడు చెప్పుకొని పది రూపాయలుంటే అప్పు ఇమ్మన్నాడు పతి! అతడు స్వామి వివేకానందుడిలా చేతులు కట్టుకొని, "రెక్సె హారిసన్"లా ముఖంపెట్టి, అంతావిని..., ఆఖరున, కళింగ యుద్ధంలో రక్తపాతం చూచి చలించి పోయిన అశోకుడిలా నవ్వుతూ "నేనూ, నీలాగే గుమాస్తానే కదురా బాబూ!" అన్నాడు. పతికి ఆశకాస్తా హరించుకు పోయింది.

సాయంత్రం ఆఫీసు అయిపోగానే కాళ్ళీడ్చుకుంటూ బస్సుస్టాపు చేరాడు. "బస్సుస్టాపు" లోని కాలేజి విద్యార్థులు "అప్పుడే కట్టలోంచి బయట పడిన పది రూపాయల కాగితాల్లా" టెర్లిన్ చొక్కాలలో రెప రెపలాడుతున్నారు. చొక్కా జేబుల్లోంచి కొత్తనోట్లు అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

పతికి పది రూపాయలు కావాలి! బాధతో మెలికలు తిరిగి పోతున్న భార్య జ్ఞప్తికి వస్తే అతని మనస్సు వ్యథతో మలినమయి పోతోంది!

ఇంతలో, బిర్లాగారి ఇనప్పెట్టెలా వున్న సిటీబస్సు పాటన్ టాంకులా శబ్దం చేస్తూ వచ్చి ఆగింది.

జనంలో తోక్కిసలాట ప్రారంభమయింది. మకుటం లేని మహారాజులా "కండక్టర్" బస్సును పరిపాలిస్తున్నాడు. పతి జనాన్ని త్రోసుకుంటూ బస్సు ఎక్కి 'గెలీలియో'లా వున్న ఒక గెడ్డపు మనిషి ప్రక్కన చోటు చేసుకుని కూర్చున్నాడు. 'గెలీలియో' దేనిని గురించో

ఏపరీతంగా ఆలోచిస్తున్నాడు. గురుత్వాకరణ సిద్ధాంతాన్ని గురించి అయివుండదు! బహుశః కుటుంబపు గొడవ లేమో!!

బస్సు టికెట్టు కొరకు పదిపైసలు కోసం జేబులో చెయ్యి పెట్టాడు పతి! చేతికి ఏదో మెత్తగా తగిలింది! ప్రక్కకు తిరిగిచూశాడు! పది రూపాయల నోటు కాదు! పంచరంగుల పర్సు! ప్రక్క-వ్యక్తి జేబులో నుండి పందెపు గుర్రంలా, బయటకు తొంగి చూస్తోంది! పర్సును చూస్తూ వుండే పతి మదిలో ఏదో విషం లాంటి ఆలోచన మెదిలింది. అతని మనసు బంగారం లాంటిదే అయినా కాని ఆ క్షణంలో మాత్రం 'సైనేడు'లా మారిపోయింది. ఆ 'పర్సులో' కనీసం పది రూపాలయినా వుంటాయి! తనకు సరిగా పది రూపాయలు కావాలి! అది తన వద్దకు వస్తే?-ఎలా వస్తుంది? దొంగిలిస్తే వస్తుంది! దొంగతనం చేస్తే వస్తుంది!!! దొంగతనం పాపకార్యాల్లో ఒకటి! అబద్ధం ఆడటంకూడా పాపమే! పతి అవసరం కొద్దీ అనేకసార్లు అబద్ధాలు ఆడాడు కాని, దొంగతనం మాత్రం చెయ్యలేదు. ఇప్పుడు ఆ అవసరం కూడా వచ్చింది!!

అతనికి పది రూపాయలు కావాలి! వణుకుతున్న చేతులతో మెల్లిగా ఆ పర్సుతీసి తన జేబులో కుక్కుకున్నాడు. ఇక అతనికి వూపిరి పీల్చుకోవాలన్నా భయంగా వుంది "తను క్షణం క్రితం వరకూ సంఘంలో పరువుగా బ్రతుకుతున్న వ్యక్తి! కాని, ఈ క్షణంలో-దొంగ! అవును!

దొంగ!" ఉలిక్కిపడ్డాడు పతి! భయంతో క్షణంసేపు గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. అప్రయత్నంగా అతని పెదవులు వణకటం ప్రారంభించాయి. ఒడలంతా చెమట పట్టింది!

తను దిగవలసిన స్టాపు రాకుండగానే గాభరంగా దిగిపోయాడు! బస్సు వెళ్ళిపోయింది. బరువుగా ఊపిరి పీల్చి వదిలాడు! భయం మాత్రం అతన్ని వదలకుండా పట్టుకొంది!

రోడ్డువైపు చూశాడు! ఎక్కడచూసినా పోలీసులే! మంత్రిగారి పర్యటనవుంది కాబోలు! ఎప్పుడూ వీధి మొఖం ఎరుగని పోలీసులందరూ మూడోక్లాసు పిల్లల్లాగ అతి వినయంగా రోడ్డుమీద నించున్నారు.

త్వరితంగా అడుగులేసుకుంటూ ప్రక్కనేవున్న పార్కులోకి వెళ్ళి ఒక మూల కూర్చున్నాడు పతి! పార్కులో పచ్చిక దట్టంగావుంది. జనం పల్చగా వున్నారు రేడియో ఏదో అర్థంకాని భాషలో విపరీతమయిన రొద చేస్తోంది.

ఎవ్వరి కంటా పడకుండా జాగ్రత్తగా పర్సు జేబులో నుండి బయటకు తీసాడు పతి! అంత వరకూ ముద్దుగా కన పడిన పర్సు ఆ క్షణంలో భూతంలా అనిపించింది.

పర్సు విప్పటానికి పతి మనసు ఒప్పుకోవటంలేదు "అందులో పది రూపాయల కంటే ఎక్కువవుంటే ఏం చెయ్యాలి?"

"డబ్బువుంటే చాలా పనులు చేసుకోవచ్చును" అని అంతరాత్మ సలహా ఇచ్చింది. పతి మెదడు అతి సంతోషంతోగాని, అతి భయంతోగాని పనిచెయ్యడం మానివేస్తే అంతరాత్మ ఇలాంటి ఉచిత సలహాలను అవసరార్థం అందిస్తూ వుంటుంది.

లక్ష్మిపతికి "విస్కీ" త్రాగాలన్న కోరిక చాలా కాలంనుండి కోరికగానే మిగిలి పోయింది! 'విస్కీ' కొంచెం ఎక్కువ మోతాదులో త్రాగి, తుళ్ళుతూ, పేలుతూ వుంటే చాలా సరదాగా వుంటుందని అతని అభిప్రాయం. "ఎక్కువ మోతాదులో విస్కీ త్రాగితే మహామజా" అనుకున్నాడు. మత్తుగా మనసులో ఆనందం మసగ్గా అలుము కుంటోంది. ఏవేవో కోర్కెలు తెరలు తెరలుగా కనుల ఎదుట తిరుగాడాయి.

క్షణంసేపు ఆలోచనలకు ఆనకట్ట కట్టి, పర్సు విప్పాడు పతి! పెద్ద అరలోనుండి భళ్లున చిల్లర ఒలికింది. అంతా కలిసి నలభై మూడుపైసలు ఉన్నాయి. మిగిలిన అరలన్నీ ఆత్రంగా వెతికాడు. ఒక అరలోనుండి చెల్లదేమోనన్న భయంతో కుచించుకు పోయిన పాత రూపాయి నోటు బయటికి వచ్చింది. పర్సులో వున్నది 'రూపాయి నలభై మూడు నయాపైసలు మాత్రమే' అని నిశ్చయమయిన ఆలోచన వచ్చాక మనసునావరించిన మత్తు తేలిపోయింది. చేతిలోని విస్కీసీసా ఎవరో తన్ని లాక్కునట్లయింది. బాధతో ఇంటివద్ద సతమతమవుతున్న భార్య మళ్ళీ కంటి ముందు ప్రత్యక్షమయింది!

'అతనికి పది రూపాయలు కావాలి! ఎలా వస్తాయి?'

ఆలోచనలోవున్న పతికి ఎదురుగా ఎవరో పదే కుర్రాడు కన్పించాడు.

'ఏం కావాలి?' అన్నాడు కుర్రవాని వైపు చూస

"...మరేమో! మా అమ్మకి జొరం వచ్చిం గొట్టంమందు తీసుకురమ్మని మా అమ్మ రూపాయి బి ఇచ్చింది. జేబు చిల్లులోంచి అది ఎక్కడో పడిపోయిం మందు పట్టుకు వెళ్ళకపోతే అమ్మనన్ను చంపేస్తుంది. మం లేకపోతే అమ్మ చచ్చిపోతుంది..." అన్నాడు ముక్కు బీల్చుకుంటూ.

పతి దీర్ఘంగా నిట్టూర్చి తన చేతిలోని డబ్బు కుర్రాడి చేతిలో పోస్తూ! మందుకొని మిగిలిన డబ్బు నువ్ తీసుకో! అన్నాడు. కుర్రాడు ఆనందంతో డబ్బు తీసుకొ పరుగుతీసాడు.

సాగి పోతున్న కుర్రాడివంక చూస్తూ తృప్తి నిట్టూర్చి, చేతిలోని పర్సు పార్కు తుప్పల్లోకి విసి ఇంటివైపు నడక సాగించాడు పతి! అతనికి పది రూ యలు కావాలి!!!

[ఆంధ్రప్రభ

♦ ♦ ♦ ♦